క్లుప్తంగా

## పూడి జగన్నాథపురంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పూడి జగన్నాథపురంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా, అనీమియాతో బాధపడే చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో 23 మంది రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడే చిన్నారుల కోసం ఈ రక్తాన్ని వినియోగిస్తున్నామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు కీలు విజయ్‌కుమార్, వంక జోగారావు, పండా, షణ్ముఖరావు, డి.తిరుపతి రావు, ఎస్.శాంతి, సావిత్రి, మోహన్ ఉన్నారు.

## భయపెడుతున్న విద్యుత్ తీగలు



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలోని పొలాల వద్ద ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నాయి. చేతికి అందే ఎత్తుల్లో తీగలు ఉండడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. వ్యవసాయ పంపు షెడ్లకు విద్యుత్ అందించే 11 కేవీ తీగలు పంట పొలాలకు వెళ్లే మార్గంలో 15 రోజుల క్రితం వీచిన గాలులకు కిందకు వేలాడుతున్నాయి. స్థానిక సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి పలుమార్లు సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులకు సమయం ఆసన్నమవ్వడంతో రైతులంతా పొలాలకు వెళ్తున్నారు. విద్యుత్ తీగలతో ఎలాంటి ప్రమాదం ముంచుకువస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 23న మెగా జాబ్‌మేళా

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎం.తోటూరు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన మెగా జాబ్ మేళా–2025 నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 16 కంపెనీల ప్రతినిధులు హాజరై 900 ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీఫార్మసీ చదువుకొని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 62818 69907 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మందస: సిరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నగరి తారకేశ్వరరావు మాట్లాడుతూ.. మానవ మనుగడకు చెట్లే ఆధారమన్నారు. మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న స్వామివార

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటిపీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి.

# శిలాఫలకాలే మిగిలాయి..!

- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని కూటమి నాయకులు

కాశీబుగ్గ:

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీడీపీ నాయకులు విఫలమవుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనికి పలాస నియోజకవర్గ పరిధిలోని కొన్నింటిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2014–19 మధ్యలో చాలా అభివృద్ధి చేశామని.. 2024లో తమకు అధికారం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలికారు. అయితే 2014–19 మధ్యలో టీడీపీ నాయకులు కేవలం అభివృద్ధి పనుల పేరుతో శంకుస్థాపనలకే పరిమితమయ్యారు. ఏఒక్క పనిని కూడా పూర్తి చేయలేదు. దీంతో శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

### కలగా మిగిలిన రైతు బజారు



రైతు బజారు ఏర్పాటుకు శంకుస్థాపన చేసి విడిచిపెట్టిన శిలాఫలకం(ఫైల్)

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతోపాటు వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలంలో ఉద్దాన ప్రాంతీయులకు అత్యవసరమైన రైతు బజారు నిర్మిస్తామని చెప్పి గతంలో టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కాశీబుగ్గలో 50 లక్షల రూపాయల ఏఎంసీ నిధులతో 2018 జూన్ 11వ తేదీన రైతు బజార్ నిర్మాణం కోసం అప్పటి రవాణా శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అప్పటి పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. రైతు బజార్ ఏర్పాటు స్థలం దళితులకు సంబంధించినది కావడంతో వారికి వేరే చోట స్థలం ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారు. అయితే అది సాధ్యం కాకపోవడంతో రైతు బజార్ ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఇప్పటికీ పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలకు రైతు బజారు ఏర్పాటు కలగానే మిగిలిపోయింది.

### పూర్తికాని మినీ స్టేడియం



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న స్టేడియం శిలాఫలకం (ఫైల్)

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు సంబంధించి సుమారు 30 వేల మంది క్రీడాకారుల కోసం మినీ స్టేడియం ఏర్పాటుకు రూ. రెండు కోట్లు మంజూరయ్యాయి. దీనికి కోసం పలాస మండలం శాసనం గ్రామానికి సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో క్రీడా వికాస కేంద్రం పేరుతో మినీ స్టేడియం కోసం 2018 జూన్ 11వ తేదీన అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అప్పటి ఎమ్మెల్యే శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. నామమాత్రంగా పనులు ప్రారంభించి వదిలేశారు. దీంతో స్టేడియం నిర్మాణం పూర్తికాకుండా పోయింది.

### నిలిచిపోయిన ప్రభుత్వ పెట్రోల్ బంకు ఏర్పాటు



దిష్టిబొమ్మలా మిగిలిన పెట్రోల్‌బంక్ శిలాఫలకం (ఫైల్)

పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తామని టీడీపీ నాయకులు హడావుడి చేశారు. 2018 మే 31వ తేదీన అప్పటి పలాస ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందరశివాజీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి ట్యాంక్‌లను సైతం తీసుకువచ్చారు. అయితే ఆ తరువాత దీన్ని కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. ఈ పెట్రోల్ బంక్ ఏర్పాటైతే మత్స్యకారులు, ఇతర సబ్సిడీ పెట్రోల్ పొందేవారికి ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం ఈ ప్రాంతం అంతా పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తుంది.

### పంపిణీ కాని హుద్‌హుద్ ఇళ్లు



వజ్రపుకొత్తూరు మండలం బెండి వద్ద ఇళ్ల శంకుస్థాపనలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, శివాజీ, శిరీష (ఫైల్)

2014 అక్టోబర్ 12వ తేదీన ఏర్పడిన హుద్‌హుద్ తుఫాను శ్రీకాకుళం జిల్లాపై పెను ప్రభావం చూపింది. వందలాది మంది ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం పలువురికి హుద్‌హుద్ పేరుతో ఇళ్లను మంజూరు చేసింది. ఎన్‌టీఆర్ గ్రామీణ ప్రత్యేక గృహ సముదాయ నిర్మాణం పేరుతో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ అనంతపురం రెవెన్యూ పరిధిలో 198, వజ్రపుకొత్తూరు మండలం బెండికొండపై 192 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర శివాజీ, ప్రస్తుత పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అప్పటి మహిళా నాయకురాలుగా శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఇంతవరకు పంపిణీ చేయకపోవడంతో కిటికీలు, ద్వారాలు, తలుపులు, విదుత్ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి.

## స్వర్ణ కిరీటానికి వితరణ



విరాళం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి స్వర్ణకిరీటం నిమిత్తం డి.మధుసూదనరావు, లక్ష్మీ దంపతులు రూ.10,116, జి.ఎస్.ఆర్ గుప్తా, కామేశ్వరి దంపతులు రూ.10వేలు, దవిలి మిహిరాన్ కార్తికేయ రూ.10వేలు, కె.వెంకటరావు, జయలక్ష్మి దంపతులు రూ.10వేలు, సాయి అశ్వంత్, నైనిష దంపతులు రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాలాచార్యులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని జ్యేష్ఠ మాసం శుద్ధ బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం ఘనంగా తిరువీధి నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# చెత్తను నడిరోడ్డున వదిలేశారు!



24వ వార్డు పురుషోత్తపురంలో ఇలా..



ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ రోడ్డులో..



కాశీబుగ్గ కేటీ రోడ్డులో..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో చెత్త సేకరణపై విమర్శలు వస్తున్నాయి. వీధుల్లో సేకరించిన చెత్తను వేసేందుకు ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ల వద్ద పరిస్థితి ఘోరంగా ఉంటుంది. కొన్ని రోజులుగా మున్సిపల్ సిబ్బంది విశాఖలో విధుల కోసం వెళ్లిపోయారు. దీంతో డస్ట్‌బిన్ల వద్ద స్థానికులు చెత్తను పడేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. కిందపడిన చెత్తను కుక్కలు, పందులు చెల్లాచెదురు చేస్తుండడంతో ఆటుగా వెళ్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# యువతను మోసం చేసిన కూటమి సర్కార్



యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణలో తిలక్, వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు

- రేపటి 'యువత పోరు'ను విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్ పిలుపు

టెక్కలి: కూటమి నాయకులు ఎన్నికల ముందు యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఈ మోసంపై నిలదీసేందుకు ఈ నెల 23న చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిలక్ పిలుపునిచ్చారు. టెక్కలి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించి యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులకు కూటమి నాయకులు చేస్తున్న మోసాలను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వివరించాలని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమానికి టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల నుంచి అత్యధికంగా విద్యార్థులు, నిరుద్యోగ యువత హాజరయ్యే విధంగా చైతన్యం కల్పించాలని తిలక్ కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అన్నివర్గాల ప్రజలకు నిలువునా మోసం చేయడమే కాకుండా కక్షపూరితమైన చర్యలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత పూర్తిగా దగా పడ్డారని దుయ్యబట్టారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పార్టీ శ్రేణులంతా టెక్కలి చేరుకోవాలని సూచించారు. ఇక్కడ నుంచి జిల్లా కేంద్రానికి తరలివెళ్దామని పేర్కొన్నారు. ఈ విషయంలో యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యర్ర చక్రవర్తి, జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, యువజన విభాగం నాయకులు చిన్ని జోగారావు, కె.శేషగిరి, బి.కార్తీక్, పి.వైకుంఠరావు, జీరు లక్ష్మణ్‌రెడ్డి, డి.నీలకంఠం, ఎం.జగన్, కె.గిరి, జి.దేవేంద్రరెడ్డి, బి.రాజేష్, నరేష్, ఆర్.డిల్లేశ్వరరావు, పి.మోహన్, వెంకటరమణ, బి.వైకుంఠరావు పాల్గొన్నారు.

## ప్రైవేటు గుప్పిట్లోకి ప్రభుత్వ వైద్యరంగం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పీపీపీ పద్ధతి వల్ల ప్రభుత్వ వైద్యరంగం ప్రైవేటు గుప్పిట్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని వక్తలు హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యకళాశాలలు – ప్రైవేటీకరణ అనే అంశంపై 'ప్రజారోగ్య వేదిక – గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం' సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రజారోగ్య వేదిక కన్వీనర్ డాక్టర్ మల్లేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు కేటాయించిందన్నారు. నిర్మాణానికి రూ.8548 కోట్లు కేంద్రం ఆమోదించగా, కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలను నమ్మబలికే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేటీకరణ కాదని ప్రభుత్వ అజమాషీలోనే కొనసాగుతాయని నమ్మబలుకుతోందని, వాస్తవానికి ఈ కొత్త కళాశాలల్లో కన్వీనర్ కోటా కుదించడంతోపాటు జనరల్ కేటగిరీ సీట్లకు భారీగా ఫీజులు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక ఇలా చేయడం అన్యాయమన్నారు. నిర్మాణం పూర్తికాని కళాశాలలను, ఆసుపత్రులను కూడా ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహిస్తుందని వాగ్దానం చేసి ఇప్పుడు పీపీపీ పద్ధతులేంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి, ఖరీదైన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు పెరగబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సామాన్య, పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులు మంచిర్యాంకులు సంపాదించినా భారీ ఫీజులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వైద్యరంగంలో సేవా దృక్పథం తగ్గిపోయి వ్యాపార దృక్పథం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో వైద్యుల కొరత ఏర్పడుతుందని, ఆరోగ్యాన్ని హక్కుగా పొందే అవకాశం తగ్గిపోతుందన్నారు. తక్షణమే పీపీపీ విధానాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యవేదిక కన్వీనర్ కామేశ్వరరావు, మాజీ కార్యదర్శి డాక్టర్ సత్యానంద్, రైతు సంఘం నాయకులు కె.మోహనరావు, ప్రజారోగ్యవేదిక నాయకులు కన్నేపల్లి శ్రీనివాస్, గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్షులు ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవం



నందిగాం మండలంలోని పెంటూరు, నరేంద్రపురం గ్రామాల మధ్య వెలిసిఉన్న రెయ్యి బోడెమ్మతల్లి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

–నందిగాం

## మొక్కలు నాటివేత



వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సర్పంచ్ వంక చిరంజీవిరావు హాజరై మొక్కలను నాటడంతోపాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పాఠశాలకు బీరువాను అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శివాజీ, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ సభ్యుడు కె.నీలావెంకటరావు, మాజీ సర్పంచ్ కె.దానేసు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.కుమారస్వామి, కె.పాపారావు పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు

## సామూహిక సీమంతాలు



భగవాన్ సత్య సాయిబాబా శత వర్ష జన్మోత్సవాల్లో భాగంగా శనివారం టెక్కలి రోటరీ నగర్‌లోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన టీఎస్‌ఎన్ బాబ్జీ దంపతుల నేతృత్వంలో 18 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ చంటితో పాటు బి.అన్నపూర్ణమ్మ, ఎస్.జగదీశ్వరరావు, వెంకటలక్ష్మి, జోగారావు, అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

–టెక్కలి

# కొళిగాంలో క్షీణించిన పారిశుద్ధ్యం!



అధ్వానంగా ఉన్న బ్రాహ్మణ వీధికి వెళ్లే రహదారి



గణేష్ ఆలయం సమీపంలో మురుగు నీరు

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించింది. గ్రామంలో స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు–గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడంటంతో వీధుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. పారిశుద్ధ్యం పనుల చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం, దోమలతో దోబూచులాటలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# ఊరూరా 'యోగా'నందం



కాశీబుగ్గ: మున్సిపల్ కార్యాలయంలో ఆసనాలు వేస్తున్న నాయకులు, అధికారులు



ఇచ్ఛాపురం టౌన్: సురంగిరాజావారి క్రీడా మైదానంలో యోగా శిబిరం



టెక్కలిలో యోగాసనాలు వేస్తున్న మండల అధికారులు, విద్యార్థులు

యోగాను రోజూ చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఊరూరా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నవారంతా ఆసనాలతో ఆకట్టుకున్నారు. యోగా గురువులు ఆసనాల ప్రాధాన్యతను వివరించారు. యోగాను దిన చర్యగా చేసుకోవడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని అవగాహన కల్పించారు. విద్యార్థులు యోగా అక్షర క్రమంలో కూర్చొని అలరించారు. ఈ సందర్భంగా యోగా గురువులను సత్కరించారు. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల్లో, పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు, మందస, పలాస, పలాస మున్సిపాలిటీలో, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో యోగా కార్యక్రమాలు జరిగాయి.

–సాక్షి నెట్‌వర్క్